

నేడు గణతంత్ర పరేడ్‌కు ఎంపికలు

ఎచ్చెర్ల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జనవరి 26న ఢిల్లీలో జరగనున్న గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొనే వలంటీర్ల ఎంపిక సోమవారం అంబేడ్కర్ యూనివర్సిటీలో నిర్వహించనున్నారు. వర్సిటీ మైదానంలో ఉదయం 9 గంటలకు ఎన్‌ఎస్‌ఎస్ స్టేట్ యూత్ ఆఫీసర్ సైదా రమావత్ ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహించనున్నట్టు వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.వనజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలకు జిల్లాలోని ఆయా కళాశాలలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొనాలని సూచించారు.

వంశధార ప్రాజెక్టు రూపకర్త జిల్లా వాసే


సీఆర్ఎం పట్నాయక్ (ఫైల్)


- సిక్కోలు కాటన్‌గా సీఆర్ఎం పట్నాయక్‌కు గుర్తింపు
- మోక్షగుండం స్ఫూర్తితో ఎంతోమందికి ఆదర్శంగా నిలిచి..
- నేడు ఇంజనీర్ల దినోత్సవం

హిరమండలం/ఎచ్చెర్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో వృథాగా కలిసిపోతున్న వంశధార నదీ జలాలను సాంకేతిక నైపుణ్యంతో అడ్డుకట్ట వేసి.. జిల్లాను సస్యశ్యామలం చేసి.. సిక్కోలు కాటన్‌గా సీఆర్ఎం (చిక్కాలవలస రాధామోహన్) పట్నాయక్ గుర్తింపు పొందారు. జిల్లాలో 2.50లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు ప్రజలకు తాగునీటిని అందిస్తున్న వంశధార ప్రాజెక్టు(గొట్టా బ్యారేజీ) రూపకర్త అయిన సీఆర్ఎం పట్నాయక్ మన జిల్లాకు చెందిన ఇంజనీరే కావడం గర్వించదగ్గ విషయం. ఇంజనీరింగ్ దిగ్గజం.. మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో ప్రాజెక్టు రూపకల్పనలో ఆయన కీలకపాత్ర పోషించారు. అలాగే వివిధ ప్రాంతాల్లో ప్రాజెక్టులు, బ్యారేజీల నిర్మాణాలకు సూచనలు అందిస్తూ.. ఎంతోమంది ఇంజనీర్లకు ఆదర్శంగా నిలిచారు. సోమవారం ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా వంశధార ప్రాజెక్టు ప్రత్యేకతలో ఆయన కృషిని గుర్తుచేసుకుందాం.

● నరసన్నపేట మండలం చిక్కాలవలసకు చెందిన సీఆర్ఎం పట్నాయక్ వంశధార నదిపై ప్రాజెక్ట్‌ను రూపకల్పన చేసి ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. 1924 అక్టోబరు 2న పర్లాకిమిడిలో జన్మించారు. విజయనగరంలో విద్యాభ్యాసం చేసి, మద్రాసు గిండీ ఇంజనీరింగ్ కళాశాలలో పట్టభద్రులయ్యారు. కొద్దికాలం తాను చదువుకున్న గిండీ ఇంజనీరింగ్ కళాశాలలో లెక్చరర్‌గా పాఠాలు చెప్పారు. తర్వాత ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఇంజనీర్ ఉద్యోగాన్ని పొంది మాంచ్‌ఖండ్‌లో పనిచేశారు. 1953లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన సమయంలో ఆంధ్ర ఇంజనీరింగ్‌శాఖకు బదిలీపై వచ్చారు. మాంచ్‌ఖండ్ ప్రాజెక్ట్‌లో పట్నాయక్ పనిచేస్తున్న సమయంలో.. ప్రాజెక్ట్ ఎత్తును 50 నుంచి 25అడుగులకు దించడం అతని సూచన మేరకే జరిగింది. ఆ తర్వాత ఈయన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌లో 1960-66 వరకు పనిచేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ స్థల సేకరణ సమయంలో కీలకపాత్ర పోషించారు. ఇతని ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం జిల్లాలో నీటి పారుదలకు అభివృద్ధికి 1966 జూన్‌లో శ్రీకాకుళం బదిలీ చేసింది. 1970లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు చేతుల మీదుగా వంశధార ప్రాజెక్ట్(గొట్టాబ్యారేజీ)కి శంకుస్థాపన చేయించారు. అలాగే ఓనిగడ్డ ఆనకట్ట, నాగావళి కుడి కాలువ పథకం, నారాయణపురం ఆనకట్ట కుడి కాలువ పనులను స్వల్పవ్యవధిలో పూర్తిచేసి ప్రభుత్వ ప్రశంసలు అందుకున్నారు.

● జిల్లాలో వంశధార ప్రాజెక్ట్ జఠిల సమస్యను పరిష్కరించి ప్రాజెక్ట్‌కు వెలుగు చూపించారు. అందుకు అనుగుణంగా నూతన విధానాలతో జలాశయాల ఏర్పాటును రూపొందించి, సెంట్రల్ వాటర్ (మిగతా 8వ పేజీలో..)


ప్రారంభ దశలో గొట్టాబ్యారేజీ పనులిలా..


హిరమండలంలోని గొట్టాబ్యారేజీ (ఫైల్)

ఎర్రన్న ఆశయాలు.. స్ఫూర్తిదాయకం

- కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు

అరసవల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్వర్గీయ ఎర్రన్నాయుడు ఆశయాలు అందరికీ స్ఫూర్తిదాయకమని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు పేర్కొన్నారు. ఆదివారం శ్రీకాకుళంలోని కోడిరామ్మూర్తి స్టేడియం దగ్గర ప్రజాసదన్‌లో 'ఎర్రన్న విద్యాసంకల్పం' విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఇటీవల డీఎస్సీ ఫలితాల్లో 130 మంది ఎర్రన్న విద్యాసంకల్పం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడపై ఆనందం వ్యక్తం చేశారు. తొలుత ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యే గొండు శంకర్, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు మెండ దాసునాయుడితో కలిసి ఎర్రన్నాయుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన విద్యార్థులకు అందిస్తున్న స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. '2013లో ఉన్నత లక్ష్యంతో ఎర్రన్న విద్యాసంకల్పం కార్యక్రమాన్ని ప్రారంభించాం. పేద విద్యార్థులు, నిరుద్యోగులు ఈ కార్యక్రమం ద్వారా ఉచిత శిక్షణ తీసుకుని ఉన్నతంగా ఎదగాలన్నదే లక్ష్యం. పేద విద్యార్థులకు చేయూతనిచ్చేలా డీఎస్సీ, గ్రూప్స్, కానిస్టేబుల్ తదితర పరీక్షలకు అవసరమైన కోచింగ్, మాక్ టెస్టులు, మెటీరియల్‌ను ఉచితంగా అందజేస్తున్నాం. ఎర్రన్న విద్యాసంకల్పంతో విద్యార్థులు మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాల'ని కేంద్రమంత్రి ఆకాంక్షించారు. అధ్యాపక బృందాన్ని సన్మానించారు.


ఎర్రన్న విద్యాసంకల్పం కిట్‌ను విద్యార్థికి అందజేస్తున్న కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు

ఇక్కడా.. ఆకాశహర్మ్యాలు

- జిల్లాలో భవన నిర్మాణాల ఎత్తు 24 మీటర్లకు పెంచే యోచన
- ప్రస్తుతం ఐదంతస్తులే.. 18మీటర్లకే అనుమతి
- ఇక ఏడంతస్తుల మేడలు.. అన్నీ హైరైజ్డ్ భవనాలే
- త్వరలో శాసనసభలో చర్చ
- పట్టణాభివృద్ధికి దోహదం

శ్రీకాకుళం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి):


జిల్లాలోని పట్టణాల్లో భవనాల ఎత్తు పెరగనుంది. అవసరమైతే ఎత్తు పెంచుకునేలా, కొత్తవి మరింత ఎత్తులో నిర్మించుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించనుంది. రాష్ట్రంలో భవనాల గరిష్ఠ ఎత్తు పరిమితిని 18 మీటర్ల నుంచి 24 మీటర్ల పెంచనున్నట్లు రాష్ట్ర హౌసింగ్, ఐ అండ్ పీఆర్ మంత్రి కొలుసు పార్థసారథి ఇటీవల ప్రకటించారు. దీనిపై అసెంబ్లీలో ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టనున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో పెరుగుతున్న జనాభా అవసరాలు, పట్టణాభివృద్ధి దృష్ట్యా ఎంతో ఉపయోగకరంగా మారనుంది. ఇక అపార్ట్‌మెంట్లు.. ఆకాశహర్మ్యాలు కానున్నాయి.

● ఐదు కాదు.. ఏడంతస్తులు

విశాఖపట్నం, హైదరాబాద్ వంటి నగరాల్లో ఇప్పటికే ఆకాశహర్మ్యాలు నిర్మించారు. 150 మీటర్ల ఎత్తు వరకూ అనుమతి ఇస్తున్నారు. 35నుంచి 40 అంతస్తులు నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. మన ప్రాంతాల్లో అంత ఎత్తులో భవనాలు నిర్మించడానికి అనుమతులు లేవు. సాధారణ అపార్ట్‌మెంట్లను ఐదంతస్తుల వరకే పరిమితం చేశారు. అంటే 18మీటర్ల కంటే ఎత్తుదాటి అపార్టుమెంట్లు, ఇతర భవనాలు నిర్మించకూడదు. 18 మీటర్ల ఎత్తు దాటితే వాటిని హైరైజ్డ్ భవనాలు కింద పరిగణిస్తారు. వాటి నిబంధనలను కూటమి ప్రభుత్వం ఈ నిబంధన సడలించనుంది. సాధారణ అపార్ట్‌మెంట్ల ఎత్తు 24 మీటర్ల వరకూ పెంచనుంది. సాధారణ అపార్ట్‌మెంట్లను ఏడంతస్తుల వరకూ నిర్మించుకునే అవకాశం కల్పించనుంది. ఈ మేరకు త్వరలో ఉత్తర్వులు విడుదల చేయనుంది. భూమి విలువ పెరగడం వల్ల హైరైజ్డ్ భవన నిర్మాణాలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. దీంతో తక్కువ భూమిలో ఎక్కువ మంది నివసించే అపార్టుమెంట్ కల్చర్ మరింత పెరగనుంది. ఇంతవరకు సుమారు 400 గజాల్లో నాలు గంతస్తులు, 600గజాల్లో ఐదంతస్తులు కట్టుకునేందుకు అనుమతి ఉంది. భవనాల ఎత్తును 24 మీటర్లకు పెంచడం వల్ల ఏడంతస్తులు కట్టుకోవచ్చు. స్థలం ఎక్కువ ఉంటే హైరైజ్డ్ భవనాలు నిర్మించుకోవచ్చు. హైరైజ్డ్ నిర్మాణాలకు అదనంగా సిటీ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు, రేరా అనుమతులతోపాటు ఎయిర్‌పోర్టు, ఫైర్ డిపార్ట్‌మెంట్ల అనుమతులు తీసుకోవాలి.

● కీలక మలుపు...

భవనాల గరిష్ఠ ఎత్తు (మిగతా 7వ పేజీలో..)


శ్రీకాకుళం నగరం వ్యూ


గెడ్డవానిపేట వద్ద కోతకు గురైన ఏటిగట్టు

వరదొస్తే.. ముంపే!

- వంశధారలో పెరిగిన నీటిమట్టం
- తీరగ్రామాల ప్రజల్లో ఆందోళన

నరసన్నపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): వంశధార నదీతీరం కోతకు గురవుతోంది. ఒడిశాతోపాటు జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు వంశధార నదిలో నీటిమట్టం పెరగడంతో తీరప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లోకి వరదనీరు చేరుతుందేమోనని భయాందోళన చెందుతున్నారు. వంశధార ఎడమ కాలువ గట్టు.. జలుమూరు మండలంలో కరకవలస, శ్రీముఖలింగం, నగరికటకం, అచ్యుతాపురం, కోమనాపల్లి, సురవరం, దొంపాక, ఊడకలపేట, అంధరవరం, రామకృష్ణపురం, ఊటపేట, నరసన్నపట మండలం గెడ్డవానిపేట, వెంకటాపురం, కామేశ్వరిపేట, లుకలాం, చేనులవలస, ఉప్పరిపేట, బుచ్చిపేట, మడపాం, పోతయ్యవలస, గోపాలపెంట, పోలాకి మండలం వనిత మండలం, డోల, గోవిందపురం గ్రామాల్లో 54 కిలోమీటర్లు వరకు విస్తరించింది. ప్రస్తుతం వంశధార నదిలో 20వేల క్యూసెక్కుల వరకూ నీరు ప్రవహిస్తోంది. నీటిమట్టం మరింత పెరిగితే గ్రామాల్లోకి వంశధార నీరు వస్తుందనే భయంతో నదీతీర (మిగతా 7వ పేజీలో..)

ఆదిత్యుని దర్శనానికి పోటెత్తిన భక్తజనం


ఆదిత్యాలయంలోని క్యూలో భక్తులు

- ఒక్కరోజే రూ.6.24 లక్షల ఆదాయం

అరసవల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణస్వామిని ఆదివారం పెద్దఎత్తున భక్తులు దర్శించుకున్నారు. క్యూలైన్లు, ఆలయ పరిసరాలు భక్తులతో నిండిపోయాయి. ఆదిత్యుడి అన్నదాన సత్రం వద్ద పెద్దసంఖ్యలో భక్తులు క్యూలైన్లలో వేచి ఉన్నారు. ఆదివారం ఒక్కరోజు స్వామికి రూ.6,24,633 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.3,18,800, విరాళాల ద్వారా రూ.80,188, ప్రసాదాల వల్ల రూ.2,25,645 వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

నేడు, రేపు కలెక్టర్ల కాన్ఫరెన్స్

- విజయవాడ వెళ్లిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- రెండోరోజు సదస్సుకు హాజరు కానున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి
- జిల్లా సమగ్రాభివృద్ధికి.. విజన్ డాక్యుమెంట్

7లో


200 మీటర్ల పరుగు పందెంలో ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు

7లో

అథ్లెటిక్స్ ఎంపికలకు విశేష స్పందన

లక్ష్యానికి తూట్లు

- మృతుల పేరున సరుకులు
- కానరాని రేషన్ కార్డుల ప్రక్షాళన

7లో

సమస్యల పరిష్కారానికి సమగ్ర కార్యాచరణ

- తక్షణమే కొత్త పీఆర్సీని వేయాలి
- ఎన్జీజీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

బహుభాషా కోవిదుడు ఆచార్య రోణంకి

- నేడు అప్పలస్వామి 116వ జయంతి

8లో



ఇది చెరువే..

ఈ చిత్రాన్ని చూసి.. పచ్చని పైరు అనుకుంటే పొరబడినట్టే. ఇది గుర్రపుడెక్క. శ్రీకాకుళం మండలం గూడేం గ్రామంలో చెరువు నిండుగా గుర్రపుడెక్క ఇలా విస్తరించింది. సాధారణంగా గ్రామాల్లో చెరువులను పశుసంరక్షణ, దోబీగాట్లు, పొలాలకు సాగునీటి కోసం వినియోగిస్తారు. కొన్నిగ్రామాల్లో తాగునీటి కోసం ఉపయోగిస్తుంటారు. ఇంకొన్ని గ్రామాల్లో చేపల పెంపకం చేస్తుంటారు. కానీ గూడెం గ్రామంలోని చెరువు నిండా గుర్రపుడెక్క పేరుకుపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, సచివాలయ సిబ్బంది స్పందించి గుర్రపుడెక్కను తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

- శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి):

అమరావతిపై యూటర్న్ జగన్ దివాలాకోరుతనమే..

● చీపురుపల్లి ఎమ్మెల్యే కళావెంకటరావు

ఎచ్చెర్ల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిపై మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి యూటర్న్ తీసుకోవడం దివాలాకోరుతనానికి నిదర్శమని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. కుప్పిలి గ్రామంలో ఆదివారం ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అమరావతి రైతులను, మహిళలను కించ పర్చిన జగన్ ముందుగా వారికి క్షమాపణ చెప్పాలన్నారు. రాజధానిని శ్మశానంతో పోల్చిన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ రాజధానిపై ఇప్పుడు ప్రేమ చూపడం విడ్డూరంగా ఉందన్నారు. ఊసరవెల్లి మాదిరిగా రంగులు మార్చేతత్వం వైసీపీదేనని మరోసారి రుజువైందన్నారు. ఆయన వెంట టీడీపీ పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షురాలు బల్లాడ అరుణ ఉన్నారు.

అంబేడ్కర్ వర్సిటీ అభివృద్ధికి సహకరించండి

● కేంద్రమంత్రిని కోరిన రిజిస్ట్రార్ అడ్డయ్య


రామ్మోహన్‌ను సత్కరిస్తున్న రిజిస్ట్రార్ అడ్డయ్య

ఎచ్చెర్ల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అభివృద్ధికి సహకరించాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య కోరారు. రిజిస్ట్రార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించి న ఆయన ఆదివారం కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. అంబేడ్కర్ వర్సిటీలో గ్రామీణ, గిరి జన ప్రాంత విద్యార్థులు అధికంగా ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వర్సిటీ అభివృద్ధికి తనవంతు సహకరిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు అడ్డయ్య తెలిపారు.

పాత పింఛన్ వర్తింపజేయాలి

ఆమదాలవలస/కవిటి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో 57 ప్రకారం డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పింఛన్ వర్తింపజేయాలని ఆ ఫోరం జిల్లా కన్వీనర్ కొత్తకోట శ్రీహరి తదితరులు కోరారు. ఈ మేరకు ఆదివారం శ్రీకాకుళంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, కవిటిలో ఎమ్మెల్యే బి.అశోక్‌లను కలిసి వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి స్పందిస్తూ.. న్యాయపరమైన మీ డిమాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకునేలా కృషి చేస్తానన్నారు. వినతిపత్రాలు అందించిన వారిలో ఫోరం రాష్ట్ర కన్వీనర్ బలగ శ్రీనివాసరావు, జిల్లా కో-కన్వీనర్లు గురుగుబిల్లి భాస్కరరావు, అట్టాడ తిరుమలేశ్వరరావు, భాస్కర్ తదితరులున్నారు.

నీటి కోసం పాట్లు


చానల్‌కు బస్తాలతో అడ్డుకట్ట వేస్తున్న రైతులు

సోంపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సకాలంలో వర్షాలు కురవకపోవడంతో చెరువులు నిండలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు దమ్ములు పెట్టినప్పటికీ సాగునీరందకపోవడంతో రైతులు తమ ప్రయత్నాలు చేస్తున్నారు. బెంకిలి, జింకిభద్ర గ్రామానికి చెందిన రైతులు పైడిగాం చానల్ ద్వారా వచ్చే నీటిని బలరాంసాగర్, ఎద చెరువులు నింపేందుకు ఆదివారం కాలువలో పిచ్చి మొక్కలను తొలగించి కిందికి పోతున్న నీటిని బస్తాలు అడ్డుగా వేసే ప్రక్రియ చేపట్టారు.

ఉద్యోగుల హక్కులను హరిస్తున్న కేంద్రం

● పోస్టల్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గణపతి



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గణపతి

సోంపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల హక్కులను కేంద్రప్రభుత్వం హరిస్తున్నదని పోస్టల్ ఉద్యోగుల సంఘం, (గ్రూప్-సి) రాష్ట్ర అధ్య క్షుడు గణపతి అన్నారు. పట్టణంలో ఆదివారం పోస్టల్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2026 జనవరిలో చెల్లించాల్సిన 8వ వేతన సవరణ బిల్లు నేటికీ చెల్లించలేదన్నారు. లేబర్ కోడ్‌ల పేరుతో ఉద్యోగుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాము, పోస్ట్‌మెన్, ఎంటీఎస్ జిల్లా నాయకులు బాబూరావు, గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నందికేశ్వరరావు పాల్గొన్నారు.

సామంత గ్రామాల అభ్యున్నతికి కృషి


హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం నియోజకవర్గం లోని సామంత గ్రామాల అభ్యున్నతికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బి.అశోక్ అన్నారు. ఆర్.తొత్తిడిపుట్టుగలో ఎంపీ ల్యాడ్‌తో నిర్మించిన కమ్యూ నిటీ హాల్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం సంక్షేమ పథకా లను అందిస్తూనే గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ మణి చంద్రప్రకాష్, పీఏసీఎస్ ఛైర్మన్ బాసుదేవ్ ప్రధాన్, టీడీపీ మండల అధ్యక్షుడు పి.కృష్ణారావు, జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు తదితరులు పాల్గొన్నారు.

పోరాట ఫలితంగానే మెయిన్ అంగన్‌వాడీ జీవో

అరసవల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కార్యకర్తల పోరాట ఫలితంగానే మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు అన్నారు. సంఘ కార్యాలయంలో ఆదివారం అభినందన సభ నిర్వ హించారు. డి.సుధ, కె.కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు లేని బైక్‌ల సీజ్

గార రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎటువంటి ధ్రువపత్రాలు లేని 4 మోటారు సైకిళ్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు. ఆదివారం కె.సైరిగాం గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితులకు ఇళ్లను ఇవ్వవద్దని, ఎవరైనా అటువంటి వారు తారసపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కలుషితాహారం తిని అస్వస్థత

బూర్జ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కొల్లివలసలో నిర్వహిస్తున్న ఓ హోటల్‌లో కలుషిత ఆహారం తిన్న తోటపాలేనికి చెందిన ముగ్గురు యువకులు అస్వస్థతకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యువకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. శనివారం సదరు హోటల్‌కు వెళ్లామని.. అయితే నిల్వ ఉంచిన మాంసాహారం ఇవ్వడంతో కడుపునొప్పికి గురైనట్లు బురిడి క్రాంతికుమార్, లావేటి సూర్యారావు, గేదెల రాంబాబు ఆదివారం తెలిపారు. స్థానికంగా వైద్యుని వద్ద చికిత్స తీసుకున్నామన్నారు. హోటల్ యజమానిని ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడ్డాడని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

కౌమార బాలికలకు రక్తహీనత పరీక్షలు

రణస్థలం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్త్రీ వ్యాధుల నిపుణుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రణస్థలం ఎస్సీ బాలికల వసతిగృహంలో బాలికలకు రక్తహీనతను గుర్తించే పరీక్షలు నిర్వహించారు. బొజ్జిపురం యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ రేవతి, ప్రశాంతి మాట్లాడుతూ.. వ్యాయామం, యోగా చేయాలని కోరారు. ప్రోగ్రాం జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ అరవింద్, ప్రమీల, రాధ పాల్గొన్నారు.

లక్ష్యానికి తూట్లు

● మృతుల పేరున సరుకులు
● రేషన్ కార్డుల ప్రక్షాళన లేదు..



సోంపేట రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు రేషన్ సరుకులు ఇవ్వాలన్నదే ప్రభుత్వాల లక్ష్యం. ఇదే ఉద్దేశంతో దేశంలో ఉన్న పేద లకు రేషన్ అందించేందుకు వన్ నేషన్.. వన్ రేషన్ పథకాన్ని అమలు చేస్తున్నారు. అయితే ఎప్పుడో దశాబ్దాల కిందటి సమా చారంతో కార్డులను నేటికీ విడుదల చేస్తుండడంతో లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి. కార్డుల్లో మృతులు, ఇతర దేశాలకు వెళ్లిన వారి వివరాలు తొలగించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు లేక పోవడంతో రేషన్ పక్కదారి పడుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. డీలర్ మనవాడైతే చాలు లబ్ధిదారుల్లో మృతులున్నా రేషన్ పొందవచ్చనే ధీమా కలుగుతోంది. ఎప్పటికప్పుడు సమాచారంతో కొత్త కార్డులు జారీ చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు లేవన్నది బహిరంగ రహస్యం. రేషన్ కార్డుల్లోని సమాచారంలో తేడాలున్నా వాటిని సరిచేసేందుకు చర్యలు తీసుకోకపోవడంతో డీలర్లకు కాసులు కురిపిస్తున్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. రేషన్ కార్డుల్లో మృతులు, శాశ్వ తంగా వలస వెళ్లిన వారు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల భార్యల పేర్లు నేటికీ కొనసాగు తున్నాయి. వాస్తవానికి ప్రతి ఏటా కార్డుల వివరాలు అప్‌డేషన్ చేయాల్సి ఉన్నా ఆ దిశలో చర్యలు లేవు. దీనివల్ల రాయితీపై ప్రజలకు నిత్యావసర సరుకులు పంపిణీకి గండి పడుతోంది. గత ప్రభుత్వం కొత్త కార్డులు మంజూరీ హడావుడిగా చేపట్టడంతో ఆశించిన స్థాయిలో లక్ష్యం నెరవేరలేదు. తాజాగా స్మార్ట్ కార్డులను కూటమి ప్రభుత్వం మంజూరు చేసినా పాత సమా చారంతోనే ఉండడంతో లక్ష్యం నెరవేరడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఒక్కో రేషన్ డిపోలో పది నుంచి 20 వరకు ఇటువంటి కార్డులు ఉన్నాయని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలల్లో 192 రేషన్ డిపోలున్నాయి. సుమారు 2,800 మంది అనర్హుల రేషన్‌ను ప్రతినెలా వారి కుటుంబ సభ్యులు పొందుతున్నట్టు గణాంకాలు చెబుతు న్నాయి. ఒక్క నియోజకవర్గంలోనే ఇలా ఉంటే జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఏ మేరకు అనర్హులున్నారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా ప్రభుత్వం కార్డుల నవీకరణ చేపట్టి అనర్హులు, మృతుల పేర్లు తొలగించాలని పలువురు కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ బి.అప్పలస్వామిని 'ఆంధ్ర జ్యోతి' వివరణ కోరగా.. రేషన్ కార్డుల్లో మృతులు, ఉద్యోగుల కుటుంబ సభ్యులు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలు డీలర్ల సహకారంతో సేకరించాలని రెవెన్యూ కార్యదర్శులను ఆదేశించామన్నారు. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

లిమ్మేశ్వరి అమ్మవారి సంబరాలు

● జలంత్రకోటలో దసరా ఉత్సవాలు ప్రారంభం
● 16 రోజుల పాటు వివిధ కార్యక్రమాలు


జలంత్రకోట గ్రామదేవత లిమ్మేశ్వరి అమ్మవారు

కంచిలి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విజయ దశమి నవరాత్రి ఉత్సవాలకు ముందు జలంత్రకోట గ్రామంలో లిమ్మేశ్వరి అమ్మవారి సంబరాలను ప్రతీ ఏటా నిర్వహించడం ఆనవాయితీ. రాజుల ఆరాధ్యదైవం లిమ్మేశ్వరి అమ్మవారి ఉత్సవాలు ఆదివారం రాత్రి ప్రారంభమయ్యాయి. గ్రామంలోని రాజుకోటలో ఉన్న పత్రకొండ అమ్మవారిని జె.శాసనాం గ్రామానికి మేళతాళాలతో ఊరేగింపుతో తీసుకు వెళ్లారు. అమ్మవారిని ఊరి పొలిమేరలు దాటించిన తరువాత లిమ్మేశ్వరి అమ్మవారిని మేళతాళాలతో గ్రామంలోకి ఆహ్వానించారు. గ్రామంలోని రాజుగారి కోట వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక ఉపాలయంలో అమ్మవారిని ప్రతిష్ఠించారు. ఒడియా రామాయణం పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా 16 రోజుల పాటు విశేష పూజలు నిర్వ హిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో జలంత్రకోటతోపాటు పి.శాసనం, కె.శాసనం, జె.శాసనం, మధుపురం, చొట్రాయిపురం, జె.మాణిక్యపురంలతోపాటు నువాగడా, తుట్టాసాయి తదితర గిరిజన గ్రామాల భక్తులు భాగస్వాములవుతా రు. జలంత్రకోట ఆస్థాన కవి కబిసూర్య బలదేవ్ రథో వంశస్థులు అమ్మవారికి పూజలు నిర్వహిస్తారు.

శరన్నవరాత్రులకు శుభరాట

జి.సిగడాం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఎస్పీఆర్ పురంలో ఆదివారం ముహూర్తపు రాట వేశారు. గత పదేళ్లుగా గ్రామంలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విశేష పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.


పందిరి రాట వేస్తున్న భక్తులు

ఇక్కడా.. ఆకాశహర్మ్యాలు

(ఐదో పేజీ తరువాయి)

పరిమితిని 18 మీటర్ల నుంచి 24 మీటర్లకు పెంచే నిర్ణయం.. రాష్ట్ర పట్టణాభివృద్ధిలో కీలక మలుపుగా భావించవచ్చు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో శ్రీకాకుళం కార్పొరేషన్‌తోపాటు ఇచ్ఛాపురం, పలాస కాశీబుగ్గ, ఆమదాలవలస, పాలకొండ, రాజాం మునిసిపాలిటీలు ఉన్నాయి. తాజా నిర్ణయంతో పట్టణాల్లో మౌలిక వసతుల విస్తరణతో పాటు నివాస, వాణిజ్య అవసరాలకు సమతుల్యత కలుగుతుంది. బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందిన వెంటనే రాష్ట్రనిర్మాణ రంగం కొత్త దిశగా పయనించే అవకాశముందని నిపుణులు భావిస్తున్నారు. శ్రీకాకుళం నగరంలో ఇప్పటివరకు ఐదంతస్తుల భవనాలే ఎక్కువగా నిర్మించారు. ఇకపై ఏడంతస్తుల భవనాలు వచ్చే అవకాశాలున్నాయి. ఎత్తు మార్పు నిర్ణయం వల్ల కార్పొరేషన్‌తోపాటు.. మునిసిపాలిటీల్లో పట్టణ ప్రణాళికలో మార్పులు తప్పనిసరి కానున్నాయి. భవన సముదాయాల ఎత్తు పెరగనుండడంతో ట్రాఫిక్, పార్కింగ్‌తోపాటు నీరు, విద్యుత్ సరఫరా, మౌలిక వసతుల పెంపు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని కొత్త ప్రణాళికలు సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది.

పొగురుతీత పనులు ప్రారంభం

కవిటి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఇద్దివాని పాలెం వద్ద పొగురుతీత పనులను ఆదివారం ప్రారంభించారు. వర్షాలు కురిస్తే బీలబట్టిలో వరదనీరు చేరుతుంది. దాంతో మాణిక్యపురం నుంచి బొరివంక వరకు ఉన్న పంట పొలాల్లోకి వరదనీరు ప్రవేశించి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బీలబట్టిలో చేరిన వరదనీటిని సముద్రంలోకి మళ్లించేందుకు గాను ప్రతిఏటా పొగురుతీత పనులు చేపట్టారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ మణిచంద్ర ప్రకాష్, పీఏసీఎస్ ఛైర్మన్ బాసుదేవ్ ప్రధాన్, కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బి.చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

కళింగ కోమటి సంఘం జిల్లా అధ్యక్షుడికి సత్కారం

సోంపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కళింగ కోమటి సంక్షేమ సంఘం జిల్లా అధ్య క్షుడిగా ఎన్నికైన పట్టణానికి చెందిన సానా షణ్ముఖరావును పలువురు సత్కరించారు. జిల్లా కేంద్రంలో తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారని, ఈ సందర్భంగా ఎన్నికకు సహకరించిన సంఘ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు ఆదివారం పట్టణంలోని కళింగకోమటి ప్రతినిధులు షణ్ముఖరావును అభినందించారు.

నేడు, రేపు కలెక్టర్ల కాన్ఫరెన్స్

● విజయవాడ వెళ్లిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ఆధ్వర్యంలో సోమ, మంగళవారాల్లో కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి జిల్లాల వారీగా కలెక్టర్లకు దిశానిర్దేశం చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక జిల్లాల్లో కలెక్టర్లను, ఎస్పీలను ఇటీవల బదిలీచేశారు. ఈ నేపథ్యంలో జరుగు కాన్ఫరెన్స్‌లో పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. శ్రీకాకుళం నుంచి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఇప్పటికే విజయవాడ వెళ్లారు. రెండో రోజు సదస్సుకు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి హాజరవుతారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా రెండురోజులు జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ వ్యవహరించనున్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి.. విజన్ డాక్యుమెంట్

గతంలో నిర్వహించిన సదస్సుల్లో జిల్లాల వారీగా కలెక్టర్లే నివేదికలు తయారు చేసి తీసుకువెళ్లారు. ఈ పర్యాయం ప్రభుత్వమే జిల్లాల వారీగా విజన్ డాక్యుమెంట్‌ను తయారు చేసింది. వీటిని ఈ సదస్సుల్లో ప్రకటించనున్నారు. ఈ విజన్ డాక్యుమెంట్ల ద్వారా జిల్లాల్లో తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్‌కు ఆదేశించనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి ఏడాదిన్నర పాలనపై.. ప్రభుత్వ విధివిధానాల అమలుపై సీఎం సమీక్షించనున్నారు. రాబోయే మూడేళ్లలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలులో వస్తున్న ఫిర్యాదులను క్రోడీకరించి నూరు శాతం సంతృప్తి స్థాయికి చేరే లక్ష్యాలను నిర్దేశించనున్నట్లు సమాచారం. శ్రీకాకుళం జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కార దిశగా నిర్ణయాలు తీసుకున్నారు. జిల్లాలో ప్రజల అవసరాలకు తగ్గట్టుగా మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా ప్రయోజనాలు.. త్వరలో నిర్వహించే అసెంబ్లీ సమావేశాల్లోనూ చర్చించాలనే భావనతో ఈ సమీక్ష జరగనుంది.

అథ్లెటిక్స్ ఎంపికలకు విశేష స్పందన

శ్రీకాకుళం స్పోర్ట్స్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియంలో ఆదివారం జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలకు విశేష స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి అండర్-14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు పరుగు పందెం, రిలే, జావెలిన్ త్రో, షాట్‌పుట్, లాంగ్‌జంప్ తదితర అంశాల్లో పాల్గొన్నారు. ఇక్కడ ఎంపికైన వారు ఏలూరు జిల్లా అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఈనెల 27వ తేదీ నుంచి జరగనున్న ఏపీ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.సాంబమూర్తి తెలిపారు. ఈ ఎంపికల ప్రక్రియలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి ఎంవీ రమణ, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.మాధవరావు, పురుషోత్తం, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.


కబడ్డీ ఆడుతున్న బాలికలు

జిల్లాస్థాయి కబడ్డీ జట్ల ఎంపికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని శాంతినగర్ కాలనీలో జిల్లాస్థాయి కబడ్డీ జట్ల ఎంపికలు ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నక్క కృష్ణారావు, సాధు ముసలినాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సాధు శ్రీనివాసరావు, శిక్షకులు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

● యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

అరసవల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సెలవులు అమలు చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం యూనియన్ 6వ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆశ కార్యకర్తలకు యాప్‌లలో ఆన్‌లైన్ పని ఇబ్బందిగా ఉందన్నారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలని, ఒప్పంద జీవోలు విడుదల చేయాలని, చట్టబ ద్ధమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనంతరం సంఘం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు.

గౌరవాధ్యక్షురాలిగా కె.నాగమణి, అధ్యక్షురాలిగా డి.ధనలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా డి.దమయంతి, పి.జయలక్ష్మి, జి.పార్వతి, ప్రధాన కార్యదర్శిగా జి.అమరావతి, సహాయ కార్యదర్శులుగా పి.ప్రేమలత, స్వర్ణలతా పట్నాయక్, ఎం.లావణ్య, కోశాధి కారిగా వై.సుజాతతో పాటు 35 మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఎన్వీ రమణ, ఆర్.ప్రకాశరావు, పలువురు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమగ్ర కార్యాచరణ

● తక్షణమే కొత్త పీఆర్సీని వేయాలి
● ఎన్జీజీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్


మాట్లాడుతున్న ఎన్జీజీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్

అరసవల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సమగ్ర కార్యాచరణ అవసరమని ఎన్జీజీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ అన్నారు. స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త పీఆర్సీని వేయాలని డిమాండ్ చేశారు. తాలూకా మొదలుకుని రాష్ట్రస్థాయి వరకు సంఘ కార్యవర్గాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘం నిరంతరం పనిచేస్తుందన్నారు. ఐక్యతతో సమష్టి పోరాటం ద్వారా సమ స్యల పరిష్కారానికి మార్గం లభిస్తుందన్నారు. ఉద్యోగుల హెల్త్ స్కీం ఇప్పటికీ సరిగా అమలు చేయడం లేదని, కొత్త పీఆర్సీ వేయడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందన్నారు. పెన్షనర్లకు ఆర్థిక ప్రయోజనాలు సరిగా దక్కడం లేదన్నారు. త్వరలో విజయవాడలో రెండు రోజుల వర్క్ షాప్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ, జేఏసీ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చౌదరి పురుషోత్తం నాయుడు, నేతలు జానకి, ఎం.రాజ్యలక్ష్మి, ఎం.సరస్వతి, జి.హైమవతి, పి.శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ఆటో, మోటార్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

అరసవల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆటో, మోటారు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వారికి తక్షణమే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని యూనియన్ నాయకుడు టి.తిరుపతిరావు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఆదివారం యూనియన్ సమావేశం నిర్వహించారు. అధిక ఫీజులు, పెనాల్టీలు పెంచే జీవోలు 21, 31 రద్దు చేయాలన్నారు.

'గాడిచర్ల'కు ఘన నివాళి

లావేరు, సెప్టెంబరు 14 (ఆంధ్ర జ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, గ్రంథాల యోద్యమకారుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు జయంతిని స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

న్యూస్ బాక్స్

నడ్డాను కలిసిన ఎన్ఈఆర్



రణస్థలం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డాను ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆదివారం విశాఖపట్నంలో మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించారు.

వరదొస్తే.. ముంపే!

(ఐదో పేజీ తరువాయి)

గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ● ఐదేళ్ల కిందట నరసన్నపేట మండలం గెడ్డవానిపేట గ్రామానికి 500 మీటర్ల దూరంలో నది ఉండేది. కానీ రెండేళ్ల కిందట వరదకు 200 మీటర్ల దగ్గరకు వచ్చిందని గ్రామస్థులు చెబుతున్నారు. నదీ తీరప్రాంతం కొట్టుకుపోకుండా ఉండడానికి కరకట్టలు నిర్మాణానికి 2008లో ప్రభుత్వం టెండర్లు పిలిచింది. రూ.58కోట్లతో కరకవలస నుంచి పల్లిపేట వరకూ 54 కిలోమీటర్ల మేర పనులు చేపట్టాలని స్పష్టం చేసింది. కానీ కాంట్రాక్టర్ 15శాతం మాత్రమే పనులు చేపట్టి నిలిపేశారు. నాటి నుంచి మిగతా పనులకు ప్రభుత్వాలు నిధులు విడుదల చేయడం లేదు. వాస్తవానికి నదిలో 30 మీటర్ల పొడవు 10 అడుగుల ఎత్తున కరకట్టలు నిర్మిస్తామని అప్పటి ప్రణా ళికలో రూపొందించారు. కానీ కరకట్టల నిర్మాణం చేపట్టలేదు. దీంతో వంశధార నదికి 30 వేల క్యూసెక్కులు వస్తే గతంలో నిర్మించిన కరకట్టలు మునిగి పోతాయి. ఎప్పటిలాగే నదీతీర ప్రాంతం కొట్టుకుపోతుందని స్థానికులు చెబుతున్నారు. భవిష్యత్‌లో కార్య చరణ ప్రణాళిక రూపొందించకపోతే తమ గ్రామం ఖాళీ చేయాల్సి వస్తుందని గెడ్డవానిపేట వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వచ్చిన వరదల వల్ల ఎన్నో ఎకరాల పొలాలు ఇసుక మేటలు వేశాయని, ఆర్థికంగా నష్టపోయామని రైతులు వాపోయారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


సురేష్ (ఫైల్)

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నగరంలోని డేఅండ్‌నైట్ కూడలి సమీపంలోని అటవీశాఖ కార్యాలయం వద్ద శనివారం రాత్రి రోడ్డుపై పడి ఉన్న వ్యక్తిని స్థానికులు రిమ్స్‌లో చేర్పించారు. అప్పటికే అతడు అపస్మారక స్థితికి చేరుకోగా వైద్యులు చికిత్స అందించారు. ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సరుబుజ్జిలి మండలం పాతపాడు గ్రామానికి చెందిన యాబాజి సురేష్‌గా గుర్తించారు. అతను కుటుంబంతో నగరంలోని గోవింద నగర్‌లో నివాసం ఉంటూ పైడి భీమవరం వద్ద ఓ ప్రైవేట్ ల్యాబ్‌లో పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య మాధురి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సురేష్ 13న ఉదయం ఎప్పటిలా విధులకు వెళ్లి సాయంత్రం తిరిగి శ్రీకాకుళం చేరుకున్నాడు. రాత్రి 8 గంటల సమయంలో సురేష్ అటవీశాఖ కార్యాలయం వద్ద అపస్మారక స్థితిలో ఉండడంతో స్థానికులు ఆసుపత్రికి తరలించారు. సురేష్ భార్య మాధురి ఫిర్యాదు మేరకు రెండో పట్టణ ఎస్ఐ రామారావు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

మృతుడిది కొత్తపూడివలసగా గుర్తింపు

లావేరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): బొంతుపేట వద్ద పంట పొలాల్లో ఈనెల 13న పోలీసులకు లభ్యమైన మృతదేహం ఆచూకీ ఆదివారం తెలిసింది. మృతుడు ఎచ్చెర్ల మండలం కొత్తపూడివలసకు చెందిన కుప్పిశెట్టి కనకయ్య (79)గా గుర్తించారు. కనకయ్యకు మతిస్థిమితం లేదని, తరచూ ఇంటి నుంచి బయటకు వెళ్లిపోతుంటాడని భార్య మహాలక్ష్మి పోలీసులకు తెలిపింది. గత నెల 31న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహానికి శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించినట్టు ఎస్ఐ జి.లక్ష్మణరావు తెలిపారు.

విద్యుదాఘాతంతో కిరాణా షాప్ దగ్ధం

జి.సిగడాం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): వెలగాడ గ్రామ ప్రధాన వీధిలో ఉన్న కిరాణా దుకాణం శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత విద్యుదాఘాతంలో దగ్ధమైంది. గ్రామానికి చెందిన దివ్యాంగుడైన చింతపల్లి రమేష్ కిరాణా దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే విద్యుదాఘాతమై షాపులో ఉన్న నిత్యావసర సరుకులు, ఫ్రిడ్జ్, ఫ్యాన్లు, డ్రింక్ బాటిల్స్, రేషన్, ఆధార్ కార్డులు, బ్యాంక్ అకౌంట్, కరెంటు మీటరు, సదరం సర్టిఫికేట్ ఇతర వస్తువులతో పాటు సుమారు రూ.10 వేల నగదు కాలిపోయాయి. మొత్తం రూ.2 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందో తెలియరాలేదు. రమేష్ ఆరేళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో కాలును కోల్పోయాడు. కిరాణా షాపు పెట్టుకొని కుటుంబాన్ని నెట్టుకువస్తున్నానని, అగ్ని ప్రమాదంతో ఉపాధి కోల్పోయానని బాధితుడు ఆవేదన వ్యక్తంచేశాడు. అగ్నిప్రమాదం విషయం తెలుసుకున్న వీఆర్వో నీలకంఠం, వీఆర్ఏ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పది అడుగుల విషసర్పం హతం



ఎల్ఎన్ పేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సరడాం గ్రామ సమీపంలో పొలాల్లో సుమారు పది అడుగుల విషసర్పాన్ని (కింగ్‌కోబ్రా) ఆదివారం హతమార్చారు. గ్రామస్థులు పొలం పనులకు వెళ్తుండగా వారి కంట పడడంతో భయపడిపోయారు. అనంతర తేరుకుని దానిని హతమార్చారు. ఇటీవల కాలంగా మండలంలో పాముకాటుకు గురై సుమారు 15 మంది వరకు ప్రాణాలు కోల్పోయారని, తామంతా నిత్యము పొలం పనుల్లోనే ఉంటున్నామని అందువల్ల దీనిని చంపేశామని తెలిపారు.

వ్యక్తిగత తగాదాను యూరియా పంపిణీతో ముడిపెట్టడం సరికాదు


ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు

సంతబొమ్మాళి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆకాశలక్కవరం గ్రామంలో శనివారం ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన చిన్నపాటి తగాదాను యూరియా పంపిణీపై ముడిపెట్టడం తగదని ఆ గ్రామస్థులు అన్నారు. తప్పుడు సమాచారం సోషల్ మీడియాలో పోస్టు చేసిన గ్రామానికి చెందిన వైసీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి సుగ్గు రామిరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నౌపడ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో వంద బస్తాల యూరియా నిల్వ ఉండడం వాస్తమని, మిగతా యూరియా వచ్చే వరకు పంపిణీ చేయకూడదని గ్రామపెద్దల సమక్షంలో నిర్ణయించినట్టు గ్రామపెద్ద బాస్కరరావు తెలిపారు. ఫిర్యాదు అందినట్టు ఎస్ఐ నారాయణస్వామి తెలిపారు. జగన్ పత్రికలో వచ్చిన అసత్య వార్తలను నిరసిస్తూ ఆ గ్రామస్థులు ఆ పత్రిక ప్రతులను దగ్ధం చేశారు. గ్రామ పెద్దలు పరపటి అప్పలరెడ్డి, సుగ్గు రమేష్‌రెడ్డి, ఎర్రయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కోసం పడిగాపులు


ఎరువుల షాపు వద్ద క్యూలో ఉన్న రైతులు

కోటబొమ్మాళి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారులు రైతులకు యూరియా కొరత లేదని పదేపదే చెబుతున్నా.. రైతులు మాత్రం ఎరువుల దుకాణాల వద్ద పడిగాపులు తప్పడం లేదు. మండల కేంద్రంలో ఓ ప్రైవేట్ ఎరువుల దుకాణం వద్ద ఆదివారం యూరియా కోసం వేకుజాము నుంచే వందలాది మంది రైతులు క్యూకట్టారు. దుకాణదారులు ఉదయం 10 గంటలకు షాపుతెరిచి పోలీసుల సాయంతో ముందున్న 70మందికి యూరియా అందించారు. అలాగే సోమవారం ఉదయం మన గ్రోమోర్ షాపు వద్ద యూరియా అందజేస్తారని పలువురు చెప్పడంతో మిగిలిన రైతులు అక్కడికి వెళ్లి టోకెన్లు ఇవ్వాలని షాపు యజమానిని కోరారు. యూరియా వస్తుందో లేదో తమకు తెలియదని, వచ్చినప్పుడే టోకెన్లు ఇస్తానని చెప్పడంతో నిరాశతో వెనుదిరిగారు.

నిరుపేదలకు అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతీ నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. పెద్ద లోగిడి గ్రామానికి చెందిన లబ్ధిదారు ఉగ్రవల్లి రాణమ్మకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2లక్షల చెక్కును క్యాంపు కార్యాలయంలో ఆదివారం అందజేశారు. రాణమ్మ భర్త భాస్కరరావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేయించగా రూ.2లక్షలు మంజూరైంది. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా ప్రభుత్వం సాయాన్ని అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పైల బాబ్జీ, ఎద్దు భాస్కరరావు, బుద్దల నరేష్ పాల్గొన్నారు.

మహిళా సాధికారిత సదస్సులో ఎమ్మెల్యే శిరీష


ప్రజాప్రతినిధులతో కలిసి సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే శిరీష

పలాస, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఆదివారం లోక్‌సభ, శాసనసభల మహిళా ప్రజాప్రతినిధులతో తొలి జాతీయ సాధికారిత సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పాల్గొన్నారు. రెండు రోజులపాటు ఈ సమావేశం లోక్‌సభ సెక్రటేరియేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. మహిళా ప్రజాప్రతినిధులు ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చ జరిగిందన్నారు. ఇన్ఫోసిస్ ఛైర్మన్ సుధా నారాయణమూర్తిని కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు.

తెలుగుభాష వికాసంపై లఘుచిత్రం

పలాసరూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభలో అంతర్జాతీయ లఘు చలన చిత్రోత్సవం తెలుగుభాష వికాసంపై 'వాడుకభాషకు గొడుగు గిడుగు' అనే లఘుచిత్రం ఎంపికైంది. పలాస మండలం లొద్దభద్ర గ్రామానికి చెందిన కొత్తపల్లి సీతారామ్ దర్శకత్వంలో తెలుగుభాషా వికాసానికి గిడుగు రామమూర్తి చేసిన సేవలు, విశేషాలను లఘుచిత్రంగా తయారు చేసి పంపించడంతో నిర్వాహకులు ఈ లఘుచిత్రాన్ని ఎంపిక చేశారు. ఈ ప్రదర్శనలో మొత్తం 42 చిత్రాలు ఎంపిక కాగా, వాడుకభాషకు గొడుగు గిడుగు అనే లఘుచిత్రం 18వ చిత్రంగా ఎంపిక చేశారు. దీనికి కావాల్సిన వివరాలను పలాస మండలం రంగోయి గిడుగుజానపద కళాపీఠం వ్యవస్థాపకుడు బద్రి కూర్మారావు కొంతమేర సమాచారం అందజేశారు. బద్రి కూర్మారావుతోపాటు కొత్తపల్లి చిన్నాచారి, తెలుగు పండితులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రాథమిక స్థాయి నుంచే హిందీ బోధించాలి

కాశీబుగ్గ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయి నుంచే హిందీని బోధించాలని హిందీ ఫోరం కమిటీ సభ్యులు సామేశ్వరరావు, విష్ణు ఆచారి, శ్రీనివాస బాబ్జీ అన్నారు. జిల్లా ఫోరం ఆధ్వర్యంలో హిందీ దివాస్ వేడుకలు ఆదివారం కాశీబుగ్గలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మునిసిపల్ ఛైర్మన్ బల్ల గిరిబాబు పాల్గొని మాట్లాడారు. సాంస్కృత కార్యక్రమాలు నిర్వహించారు. ఎంఈవోలు శ్రీనివాసరావు, సత్యం,డిసిఇబి ఛైర్మన్ సంజీవరావు, ఉపాధ్యాయులు సుభాష్‌బాబు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

పలాస, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక కోసంగిపురం లలితా చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ ఎస్.చిన్నికృష్ణ అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో శనివారం సాయంత్రం ఓ యాచకుడు చనిపోయాడు. పోలీసులు చిన్నికృష్ణను సంప్రదించగా అంత్యక్రియలకు ఆయన సహకారం అందించారు. జీడి వ్యాపారవేత్త బోయిన నరేష్, మల్లా బాబూరావు స్పందించి నగదు అందించడంతో చిన్నికృష్ణ, తమ్మినేని సుధీర్, హనుమంతు శ్రీనివాస్ కలసి ట్రస్టు నిర్వహణలో ఉన్న శ్మశాన వాటికలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. చిన్నికృష్ణ ఇప్పటి వరకూ 679 అనాథ శవాలకు ఉదారంగా అంత్యక్రియలు చేపట్టారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక


ప్రణీత్‌ను అభినందిస్తున్న హెచ్ఎం ఉషారాణి

కాశీబుగ్గ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి డైరెక్ట్ డిస్ట్రిక్ సెలక్షన్స్ క్రీడా పోటీల్లోని మూడు విభాగాల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైన చినబాడం విద్యార్థి ప్రణీత్ ఎంపికైనట్టు హెచ్ఎం చింతాడ ఉషారాణి, వ్యాయామ ఉపాధ్యాయురాలు జి.గీత తెలిపారు. ఈ సందర్భంగా ప్రణీత్‌ను జగదీశ్వరరావు, షన్ముఖరావు, మన్మథరావు, జయలక్ష్మి, నగేష్, దుర్గారావు తదితరులు అభినందించారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

నరసన్నపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గల సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఆరోగ్య వైద్య శిబిరాలు బాలికలు సద్వినియోగం చేసుకోవాలని గైనకాలజిస్టు రెడ్డి సంధ్యారాణి తెలిపారు. స్థానిక బీసీ బాలికల వసతి గృహంలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య వైద్య శిబిరంలో ఆమె పాల్గొని కౌమార బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గైనకాలజిస్టులు వి.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



నరసన్నపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట జూనియర్ కళాశాలలో 2008-10లో ఇంటర్ చదువుకున్న విద్యార్థులు ఆదివారం స్థానిక ఓ కల్యాణ మండపంలో కలుసుకుని సందడిగా గడిపారు. ఈ సందర్భంగా ఆ ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులు రాంబాబు, కన్నయ్య, కృష్ణ, రాము, త్రినాథ, సురేష్, మదీన్, పద్మ, రమ్య పాల్గొన్నారు.

పాడి పశువులకు టీకాలు తప్పనిసరి

హరిపురం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరని హరిపురం పశువైద్యులు కిల్లి ఉమాభారతి, మందస వైద్యులు దువ్వాడ శ్రీకాంత్ తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా రైతులకు ఈ టీకాల కార్యక్రమం సోమవారం నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు స్పష్టం చేశారు. కాళ్ల గిట్టల మధ్య పుండ్లు, నోటి నుంచి చొంగ కారడం, తిండి తినకపోవడం వంటివి ఈ వ్యాధి లక్షణాలన్నారు. మండలంలో 11,200 డోసులు సిద్ధం చేసినట్టు తెలిపారు.

ఉపాధి క్షేత్ర సహాయకుల కార్యవర్గం

మెళియాపుట్టి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ క్షేత్ర సహాయకుల మండల కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ మండల అధ్యక్షుడిగా సవనల తిరుపతిరావు, ఉపాధ్యక్షుడిగా మజ్జి రాజు, కార్యదర్శిగా సరిపురం జగదీష్, కోశాధికారిగా వనజాక్షి ఎన్నికనట్టు అధ్యక్షుడు తెలిపారు. సభ్యులు శ్రీనివాసరావు, ధనంజయ్, మోహన్ తదితరులు ఉన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

నందిగాం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై విద్యార్థుల్లో అప్రమత్తంగా ఉండాలని పలువురు వైద్యులు సూచించారు. ఆదివారం టెక్కలి ఎస్సీ బాలికల వసతిగృహంలో శ్రీకాకుళం జిల్లా ప్రసూతి, స్త్రీవైద్యుల సంఘం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తహీనత పరీక్షలు, గైనిక్ సమస్యలు తదితర సమస్యలపై తనిఖీలు చేపట్టి మందులు అందజేశారు.

ప్రమాదకరంగా నగరంపల్లి రోడ్డు

వజ్రపుకొత్తూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రధాన రోడ్డు మార్గాల్లో నగరంపల్లి-పెద్దబడాం రోడ్డు ప్రమాదకరంగా తయారైంది. మార్కెట్‌కు వెళ్లేందుకు దగ్గర దారి కావడంతో నిత్యమూ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కొన్నేళ్లుగా మరమ్మతులు లేకపోవడంతో రోడ్డంతా పెచ్చులూడి వాహనాలు రాకపోకలకు ఇబ్బందిపడుతున్నారు. పంచాయతీరాజ్ జేఈ నాగభూషన్ మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాని, టెండర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత పనులు చేపడతామన్నారు.


బకాయిలు విడుదల చేయాలి


ఎమ్మెల్యేకి వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

పోలాకి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు విడుదల చేయించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దవళ సరస్వతి, ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని ఆదివారం మబగాంలో కలిసి వినతి పత్రం అందించారు. పీఆర్సీ, సీపీఎఫ్ తదితర సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.

బహుభాషా కోవిదుడు ఆచార్య రోణంకి

- నేడు అప్పలస్వామి జయంతి


రోణంకి అప్పలస్వామి

టెక్కలి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): నెత్తిర దొర టోపీ, లాజుప్యాంటు, ఇన్‌షర్ట్, చేతిలో స్టిక్‌తో టెక్కలి రోడ్లపై కొన్నాళ్ల కిందట కనిపించే ఆ వ్యక్తి సాదాసీదా వ్యక్తి కాదు. ప్రపంచం మెచ్చుకున్న ఓ బహుభాషా కోవిదుడు. ఫ్రెంచ్, స్పానిష్, గ్రీక్, హిబ్రూ, ఇటాలియన్ వంటి యూరోపియన్ భాషలను అధ్యయనం చేసిన మహనీయుడు.. ఆయనే ఆచార్య రోణంకి అప్పల స్వామి. రోణంకి నారాయణరావు, తల్లి చిట్టెమ్మలకు 1909 సెప్టెంబరు 15న ఇజ్జువరం గ్రామంలో జన్మించి టెక్కలి గోపినాథపురంలో స్థిరపడ్డారు. వివిధ భాషల్లో రచనలు, ప్రసంగాలు, అనువాదాలు చేయడంలో రోణంకి నిష్ణాతుడు. ఆ రోజుల్లో బెనారస్ యూనివర్సిటీలో ఎంఏ ఆంగ్లం పట్టా పుచ్చుకున్న ఆయన ఆచార్యుడుగా, బహుభాష కోవిదుడిగా ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. చివరికి 1987 మార్చి 28న ఆయన మరణించారు. ఆయన జ్ఞాపకార్థం టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సాహితీ సాంస్కృతిక సమాఖ్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. చాసో రాసిన కుంకుడాకు, వంతెనకింద వంటి కథలను ఆంగ్లంలోకి అనువదించారు. తన చివరి కవితా సంపుటి 1985లో దినాప్ అండ్ అదర్ పోయమ్స్‌ను విడుదల చేశారు. విజయనగరం ఎంఆర్ కళాశాలల్లో ఆంగ్ల విభాగం అధ్యాపకుడిగా, 1974-78లో ఆంధ్రా యూనివర్సిటీ విశాఖలో ఆంగ్ల ఆచార్యుడిగా బోధించారు. కాగా రోణంకి అప్పలస్వామి 116వ జయంతిని సోమవారం సాయంత్రం 4.30గంటలకు సాహిత్య, సాంస్కృతిక సమాఖ్య, విశ్రాంతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో టెక్కలిలో నిర్వహించనున్నట్టు సమాఖ్య ప్రధాన కార్యదర్శి బొడ్డ అయ్యబాబు తెలిపారు.

నేడు హుండీల లెక్కింపు

పాతపట్నం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక నీలమణి దుర్గ ఆలయంలో గల హుండీలను సోమవారం లెక్కించనున్నట్టు ఈవో టి.వాసుదేవరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ అర్చకులు, భక్తుల సమక్షంలో హుండీలను తెరవనున్నట్టు, ఆసక్తి గల భక్తులు సోమవారం ఉదయం 10గంటలకు డ్రెస్ కోడ్ పాటించి లెక్కింపునకు హాజరుకావాలన్నారు.

విద్యుత్ అంతరాయంతో అవస్థలు

టెక్కలి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్ పంచాయతీ ఎన్టీఆర్ కాలనీలో 17, 18లైన్లలో శనివారం రాత్రంతా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో కాలనీవాసులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఒకవైపు ఉక్కపోత, మరోవైపు దోమల మోతతో ఇబ్బంది పడ్డారు. తరచూ విద్యుత్ కోతలతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆ కాలనీ వాసులు కోరుతున్నారు.

సీనియర్ న్యాయవాది మృతి

టెక్కలి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ టెక్కలికి చెందిన సీనియర్ న్యాయవాది తిర్లంగి జానకిరామయ్య(65) ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈయన స్వగ్రామం నందిగాం మండలం రాంపురం. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. టెక్కలి బారు అసోసియేషన్ అధ్యక్షుడు అజయ్‌కుమార్, వివేకానంద సంతాపం తెలిపారు.

పొలాల్లోకి దూసుకుపోయిన కారు

పోలాకి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రహిమాన్‌పురం పంచాయతీ పరిధిలోని బార్జిపాడు పెద్దచెరువు వద్ద ఆదివారం ఓ కారు అదుపుతప్పి సమీప పొలాల్లోకి దూసుకుపోయింది. ఆ సమయంలో ఎవరకూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. బార్జిపాడు నుంచి నరసన్నపేట వస్తున్న ఈ కారులో ఉన్నవారికి ఎటువంటి గాయాలు కాలేదని స్థానికలు తెలిపారు.

'రణభేరి'కి తరలిరండి

నందిగాం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోరుతూ యాటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించే రణభేరి జాత ద్విచక్రవాహన ర్యాలీకి తరలిరావాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి బాలక శంకరరావు, మండలశాఖ అధ్యక్షులు కె.కుమారస్వామి ఒక ప్రకటనలో కోరారు. సోమవారం పలాసలో జాత ప్రారంభమై నందిగాం 11.30 గంటలకు ఉన్నతపాఠశాల ప్రాంతానికి చేరు కుంటుందని, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొనాలన్నారు.

వంశధార ప్రాజెక్టు రూపకర్త జిల్లావాసే

(ఐదో పేజీ తరువాయి)

కమిషన్ నుంచి అనుమతి సాధించి వంశధార ప్రాజెక్ట్‌కు ప్రభుత్వంతో మంజూరు చేయించారు. అప్పటినుంచి వంశధార ప్రాజెక్ట్ రూపశిల్పిగా పేరొందారు. అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు సూచనల మేరకు విశాఖపట్నం సర్కిల్‌లో సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న పట్నాయక్ నాగావళి, వంశధార నదుల అనుసంధానానికి ఒక పథకం తయారుచేసి ప్రభుత్వానికి అందజేశారు. దీని ఆధారంగానే నాగావళి నదిపై పలు ప్రాజెక్ట్‌ల రూపకల్పనకు అవకాశం ఏర్పడింది. అప్పటి రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి వాసిరెడ్డి కృష్ణమూర్తినాయుడు సహకారంతో వివిధ సాగునీటి ప్రాజెక్ట్‌లను మంజూరు చేయించారు. నెల్లూరు సర్కిల్‌లో ఎస్ఈగా పనిచేస్తూ పట్నాయక్ ఉద్యోగ విరమణ చేశారు. భారత స్వర్ణోత్సవాల్లో భాగంగా 1997లో ప్రభుత్వం స్వర్ణభారతి పురస్కారాన్ని ఈయనకు అందజేసింది. వంశధార సర్కిల్ కార్యాలయంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్యతోపాటు సీఆర్ఎం పట్నాయక్ విగ్రహాలను గతేడాది ఆవిష్కరించారు. 93ఏళ్ల వయసులో ఈయన 2017లో శ్రీకాకుళంలోని స్వగృహంలో మృతిచెందారు.


గొట్టాబ్యారేజీ పటిష్ఠతకు సూచనలిస్తున్న సీఆర్ఎం పట్నాయక్ (ఫైల్)

ఆ రోజుల్లో...

ప్రస్తుతం బ్యారేజీ కట్టాలంటే.. ఆధునిక యంత్రాలను ఉపయోగించి సుమారు నాలుగైదేళ్లలో పూర్తిచేస్తున్నారు. కానీ మూడున్నర దశాబ్దాల కిందట చిన్నచిన్న యంత్రాలు, కూలీలు, గాడిదల సహాయంతో కేవలం ఏడేళ్లలో వంశధార నదిపై గొట్టాబ్యారేజీ నిర్మించారు. తొలుత 1954లో హిరమండలంలోని గొట్ట దగ్గర 16 టీఎంసీలు నిల్వ ఉంచేలా రిజర్వాయర్ నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళికలు తయారు చేశారు. దీని ప్రకారం 32వేల ఎకరాల వ్యవసాయ భూమి, 30గ్రామాలు పూర్తిగా, 32గ్రామాలు పాక్షికంగా ముంపునకు గురికానున్నట్టు గుర్తించారు. ఈ నేపథ్యంలో తుంగతంపర శాస్త్రి తన 400 ఎకరాల భూమి మునిగిపోతుందనే తలంపుతో రాష్ట్రపతి వి.వి.గిరి అండతో రిజర్వాయర్ నిర్మాణానికి అడ్డంకులు వేశారు. దీంతో ప్రభుత్వం 1966లో సీఆర్ఎం పట్నాయక్‌కు వంశధార ప్రాజెక్టుకు నమూనాలు తయారు చేయాలని సూచించింది. రాజకీయంగా, సాంకేతిక అడ్డంకులు తొలగించేలా ఆయన రిజర్వాయర్ నిర్మాణానికి రూపకల్పన చేశారు. రిజర్వాయర్‌లో 19టీఎంసీలు నిల్వ చేయడమే కాకుండా కేవలం 10వేల ఎకరాలు మాత్రమే ముంపునకు గురయ్యాయి. దేశంలో ఎక్కడా లేని విధంగా నది పక్కన రిజర్వాయర్ నిర్మాణానికి నాంది పలికారు. 1970లో గొట్టాబ్యారేజీకి పునాది వేసి.. 1977లో పూర్తిచేశారు. 2.90 లక్షల క్యూసెక్కుల నీటిప్రవాహం వచ్చినా తట్టుకునేలా బ్యారేజీ నిర్మించారు. అయితే 1980లో భారీ వర్షాలకు 6లక్షల క్యూసెక్కులకుపైగా వరద నీరు వచ్చినా బ్యారేజీ నిర్మాణం చెక్కుచెదరలేదంటే నిర్మాణంలో ఎలాంటి నాణ్యత పాటించారో అర్థమవుతోంది. అప్పట్లో ఆయన గొట్టాబ్యారేజీ వద్దకు వచ్చి వరద పరిస్థితిని పరిశీలించారు. తిరిగి వెళ్లేందుకు దారిలేక పక్కనే కొండలపై నుంచి నడుచుకుని నరసన్నపేట చేరుకున్నారు. ఈ సంఘటన ఆయన కార్యదీక్షకు అద్దం పడుతోంది.

- ప్రస్తుతం నిర్మిస్తున్న వంశధార ఫేజ్-2, స్టేజ్-2 ఆలోచన ఆయనదే. 15ఏళ్ల క్రితం ప్రకాశం బ్యారేజీలో క్లిష్టమైన సాంకేతిక సమస్యను ఈయన పరిశీలించారు. ప్రకాశం బ్యారేజీ భద్రతకు పలు సూచనలిచ్చారు. అనకాపల్లి వద్ద తాండవ ప్రాజెక్టులో సాంకేతిక సమస్యలకు ఈయన సూచనలు పరిష్కారాన్ని చూపాయి. ఇలా ఎంతోమంది యువ ఇంజనీర్లకు మెలకువలు నేర్పి ఆదర్శంగా నిలిచారు. నీటిపారుదల విభాగంలో అనేక ప్రాజెక్టులను సమగ్రంగా పరిశీలించి, వాటి లోపాలను సరిదిద్దేందుకు సాంకేతిక అంశాలపై పుస్తకాలు రచించారు. ఆయన కుమారుడు కూడా ఒడిశా ఇరిగేషన్ చీఫ్ ఇంజనీరుగా పనిచేస్తున్నారు. ఆంధ్రా-ఒడిశాకు సంబంధించి వంశధార జలవివాదంలో కొడుకు వాదనను కూడా కాదని, జిల్లా ప్రగతికి ఎనలేని కృషి చేశారు. పదవీ విరమణ చేసి ఏళ్లు గడిచినా.. ప్రభుత్వం వివిధ ప్రాజెక్టుల మరమ్మతుల విషయంలో ఈయన సూచనలు, సలహాలు తీసుకోవడం గర్వించదగ్గ విషయం.

చూడాలని కోరికతో..

సీఆర్ఎం పట్నాయక్ 2016 ఆగస్టు 30న గొట్టాబ్యారేజీని చూడాలని.. అక్కడకు తనను తీసుకెళ్లాలని వంశధార అధికారులను కోరారు. 31న అప్పటి ఎస్ఈ బి.అప్పలనాయుడు ఆయనను బ్యారేజీ వద్దకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వంశధార రిజర్వాయర్ మధ్యలో శివాలయం నిర్మించాలని అధికారులకు సూచించారు. నీటిలో మునగనంత ఎత్తులో దీనిని నిర్మించి రాకపోకలకు మార్గం ఏర్పాటు చేయాలన్నారు. ముంపు గ్రామాల్లో పురాతన శివాలయాన్ని గుర్తించి రిజర్వాయర్ నీటి మధ్యలో ఏర్పాటు చేస్తే గొప్ప పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. 93 ఏళ్ల వయసులో కూడా గొట్టాబ్యారేజీ అభివృద్ధికి పాటు పడటం ఆయనలో నిబద్ధతకు నిదర్శనం.